ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
14-11-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 69 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి



...మిగతాది 2 లో

# ఝార్ఖండ్ లో ముగిసిన పోలింగ్

ఝార్ఖండ్ రాష్ట్రంలో రెండు విడతలుగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్ నవంబర్ 13న బుధవారం ప్రారంభమైంది. నవంబర్ 13 నుంచి నవంబర్ నవంబర్ 20 దాకా రెండు విడతల్లో జరుగుతున్న ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిదశలో భాగంగా 15 జిల్లాలోని 43 నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఆదివాసీ, దళిత జనాభా ఎక్కువగా ఉన్న ఝార్ఖండ్‌లో ఉదయం నుంచే ప్రజలు ఓటు వేయడానికి పోలింగ్ బూత్ లలో క్యూ కట్టారు. ఉదయం 7 గంటల నుంచి 1.30 గంటలకు 63.04 శాతం పోలింగ్ నమోదు అయినట్లు సమాచారం. నియోజకవర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా సిమ్‌డేగా జిల్లాలో 715 శాతం ఓటింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా ఉత్తర సింహభూమ్ జిల్లాలో 74.25 శాతం ఓటింగ్ జరిగిందని స్థానిక మీడియా రిపోర్ట్. ముఖ్యంగా ఆదివాసీ రిజర్వ్‌డ్ క్యాటగిరీ నియోజకవర్గాల్లో ఎక్కువ పోలింగ్ నమోదు అయింది. ఆ నియోజకవర్గాల్లో ప్రజలు తెల్లవారుఝామున 5 గంటల నుంచి క్యూలలో నిలబడ్డారు. పైగా ఓటర్లలో మహిళలు అధికంగా ఉండడం విశేషం. మరోవైపు రాంచీ, జమ్‌షెడ్‌పూర్ లాంటి పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లకు ఓటర్లు ఆలస్యంగా వస్తున్నట్లు తెలిసింది.

# బుల్డోజర్ జస్టిస్ పై సుప్రీం తీవ్ర ఆగ్రహం



**జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 13:**
ప్రభుత్వ అధికారులకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించే హక్కు లేదని సుప్రీం కోర్టు బుధవారం ఒక కీలక తీర్పులో తెలిపింది. విచారణ పూర్తి కాకుండానే నిందితుడిని దోషిగా తేల్చేయడం.. ఒక వ్యక్తి నేరం చేస్తే.. అతడి కుటుంబాన్ని కూడా శిక్షించేందుకు చట్టం అంగీకరించదని సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం మండి పడింది. సుప్రీం కోర్టులో మధ్య ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు బుల్డోజర్ జస్టిస్ పేరుతో ఇళ్లను కూల్చివేయడానికి వ్యతిరేకంగా దేశ అత్యున్నత కోర్టులో అధిక సంఖ్యలో పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లను విచారణ చేసిన జస్టిస్ బిఆర్ గవై, జస్టిస్ విశ్వనాథన్ ద్విసభ్య ధర్మాసనం కీలక తీర్పు వెలువరిస్తూ.. కొన్ని గైడ్ లైన్స్ జారీ చేసింది.
జస్టిస్ గవై, జస్టిస్ విశ్వనాథన్ ఈ పిటీషన్ల విచరాణ సమయంలో తీర్పు వెలువరిస్తూ.. చేసిన వ్యాఖ్యలు ఇవే..

...మిగతాది 2 లో

## ఏపీలో మహిళలకు నెలకు రూ.1500
### సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం



చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయింపులు చేసింది. అందులోభాగంగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. అందుకోసం ఈ ఆర్థిక సంవత్సరానికిగాను రూ.3341.82 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. మహిళలకు ఆర్థిక సహకారం పేరుతో బడ్జెట్‌లో ఈ నిధులను కేటాయించారు. ఎస్సీ మహిళలకు రూ.1198.42 కోట్లు, ఎస్టీ మహిళలకు రూ. 330.10 కోట్లు, బీసీ మహిళలకు రూ. 1099. 78 కోట్లు, మైనార్టీలకు రూ. 83.79 కోట్లు, ఆర్థికంగా వెనుక బడిన వారికి రూ. 629. 37 కోట్ల నిధులను కేటాయించారు.
ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆంధ్ర ఓటరు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు

...మిగతాది 2 లో



## వికారాబాద్ లో టెన్షన్.. టెన్షన్
### పట్నంనరేందర్ రెడ్డి అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 13:**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో అధికారులపై దాడి చేసిన కేసు కీలక మలుపు తిరిగింది. ఈ దాడికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి ఉన్న అనుమానిస్తున్న పోలీసులు ఆయన్ని ఈ ఉదయం అరెస్టు చేశారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన నరేందర్ రెడ్డిని ఫిలింనగర్‌లో అరెస్టు చేశారు. ఫిలింనగర్ సమీపంలో ఉన్న కేబీఆర్ పార్క్‌లో వాకింగ్‌కు వెళ్లి వస్తున్న పట్నం నరేందర్ రెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ టైంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయన అరెస్టును చుట్టూ ఉన్న అనుచరులు అడ్డుకున్నారు. పోలీసులకు అనుచరులకు మధ్య కాసేపు తీవ్ర తోపులాట జరిగింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ కోసం భూ సేకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీని కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ టైంలో జిల్లా అధికారులను పథకం ప్రకారం పిలిచి దాడి చేశారని సురేష్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతానికి సురేష్ పరారీలో ఉన్నారు. అయితే కేసు విచారణలో భాగంగా సురేష్ ఫోన్ కాల్ లిస్టు చూసిన అధికారులు కీలక అంశాలను గుర్తించారు. గత కొన్ని రోజులుగా సురేష్ అనే వ్యక్తి పదే పదే

...మిగతాది 2 లో

## తూతూ మంత్రంగా సర్వే




**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 13:**
తెలంగాణలో వారం రోజుల క్రితం ప్రారంభమయిన కులగణన సర్వే విషయంలో ఒకింత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కులగణన సర్వేలో వ్యక్తిగత వివరాలను కూడా అడుగుతుండటంతో వాటిని చెప్పేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారు. ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. వ్యక్తిగత కుటుంబ వివరాలను చెప్పేందుకు కూడా పెద్దగా ఆసక్తి కనపర్చడం లేదు. కొందరు తప్పుడు సమాచారం ఇచ్చి సిబ్బందిని త్వరగా పంపుతున్నారని తెలిసింది. దీంతో కులగణన సర్వే ఏ మేరకు సక్సెస్ అవుతుందన్నది చూడాల్సి ఉంది. సమగ్ర సమాచారం లభిస్తుందా? అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఫోన్ నెంబర్లు ఇచ్చేందుకు ఎక్కువ మంది ప్రజలు నిరాకరిస్తున్నట్లు ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. అదే సమయంలో ఆస్తుల వివరాలను కూడా చెప్పేందుకు ముందుకు రావడం లేదు. ఆస్తుల వివరాలను తీసుకుని మీరు ఏం చేసుకుంటారన్న ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి.

...మిగతాది 2 లో



## మూడు జిల్లాల్లో అమోయ్‌కుమార్ భూలీలలు

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 13:**
తెలంగాణలో ఈ మధ్య బాగా పాపులర్ అయిన అధికారి ఐఏఎస్ అమోయ్‌కుమార్. ఆయన భూలీలలకు ఏకంగా ఈడీ రంగంలోకి దిగిందంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్, ఆర్డీఓ, తహశీల్దార్ ఇలా అందరూ కట్టకట్టుకుని ఈడీ ముందు వాలిపోయారు.లేటెస్ట్‌గా మూడు జిల్లాల నుంచి సీఎంవోకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల అండ దండలతో యథేచ్ఛగా భూ బదలాయింపులకు ఆయన పాల్పడినట్టు తెలుస్తోంది. మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు ప్రైవేట్ పరం చేశారన్నది అందులోని అసలు సారాంశం.దీంతో మూడు జిల్లాల భూములపై రేవంత్ సర్కార్ ఫోకస్ చేసింది. కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్

...మిగతాది 2 లో

## కాషాయ దళ పతి రేసులో నలుగురు

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## జార్ఖాండ్ లో ముగిసిన పోలింగ్

తొలిదశ ఎన్నికల్లో ఝార్ఖండ్ లోని బడా నేతలు పోటీపడుతున్నారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి చంపాయి సోరేన్, ఆయన కుమారుడు బాబూ లాల్ సోరేన్, మాజీ సిఎం అర్జున్ ముండా భార్య మీడా ముండా, సీనియర్ నాయకుడు మధు కోడా సతీమణి గీతా కోడా, రఘువీర్ దాస్ కోడలు పూర్ణిమా సాహు, మంత్రి మిథిలేష్ ఠాకుర్, మంత్రి రామేశ్వర్ ఉరావ్, రాంచీ సిట్టింగ్ ఎమ్మెల్యే సిపి సింగ్, అధికరా పార్టీ జెఎమ్ఎమ్ కు చెందిన రాజ్యసభ సభ్యురాలు మహువా మాజీ ఈ రోజు ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఝార్ఖండ్ రాష్ట్రంలోని మొత్తం 81 అసెంబ్లీ సీట్లకు గాను 43 సీట్లలో నవంబర్ 13న ఓటింగ్ జరుగుతుండగా.. మిగతా 38 సీట్లకు నవంబర్ 20న ఓటింగ్ జరుగనుంది. 43 అసెంబ్లీ సీట్లపై 2019 లో జరిగిన ఎన్నికల్లో యుపిఎ కూటమి (ప్రస్తుత ఇండియా కూటమి) 29 సీట్లలో విజయం సాధించింది. మిగతా 14 సీట్లు.. బిజేపీ, ఆల్ ఝార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ పార్టీలు గెలుచుకున్నాయి. నవంబర్ 20న రెండో విడత లో 38 సీట్లకు ఓటింగ్ జరుగనుంది. ఈ 38 సీట్లలో కూడా యుపిఎ కూటమి పార్టీలు 22 సీట్లలో విజయం సాధించడం గమనార్హం.ఝార్ఖండ్ లో ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ కొంత కాలం జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. ఆయన జైలులో ఉన్న సమయంలో పార్టీ తరుపున తాత్కాలిక సిఎంగా సీనియర్ నాయకుడు చంపయి సోరేన్ ఉన్నారు. బెయిల్ పై బయటికి వచ్చిన తరువాత హేమంత్ సోరేన్ తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టడానికి చంపాయి సోరేన్ ని గద్దె దించారు. దీంతో చంపాయి సోరేన్, పార్టీ మధ్య విభేదాలు తలెత్తి ఆయన బిజేపీలో చేరారు.

## జస్టిస్ పై సుప్రీం తీవ్ర ఆగ్రహం

ఏదైనా నేరంలో నిందితుడిగా ఉన్నంత మాత్రాన ఆ వ్యక్తి నివాసాన్ని కూల్చి వేసే హక్కు అధికార యంత్రాంగానికి లేదు. రాజ్యాంగంలోని సెపరేషన్ ఆఫ్ పవర్స్ కు ఇది విరుద్ధం. ఎవరైనా ప్రభుత్వ అధికారి సరైన అనుమతులు లేకుండా విచారణ ఎదుర్కొంటున్న ఒక వ్యక్తి ఇంటిని కూల్చేస్తే.. అది నియమాలను ఉల్లంఘించినట్లే అవుతుంది. ఒక నిందితుడిని దోషిగా తేల్చే హక్కు ఒక ప్రభుత్వ అధికారికి లేదు. ఆ నిందితుడిని శిక్షించేందుకు అతడు నివాసముంటున్న ఇంటిని కూల్చేసే అధికారం ఎవరికీ లేదు. – ఇల్లు కలిగి ఉండడం ప్రతి వ్యక్తి మౌలిక అధికారాలలో ఒకటి. అందువల్ల సదరు వ్యక్తి ఏదైనా నేరంలో నిందితుడిగా ఉన్నా.. దోషిగా తేలినా.. అతడిని శిక్షించేందుకు చట్ట విచారణ పూర్తి కాకుండా కోర్టు అనుమతి లేకుండా అతడి ఇంటి కూల్చేయడానికి ప్రభుత్వ అధికారులకు ఎటువంటి హక్కు లేదు. ఒకవేళ ఇలా చేస్తే. ఇది క్రిమినల్ జస్టిస్ కి విరుద్ధం. నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తి నేరం చేశాడని కోర్టు విచారణ ప్రక్రియ ప్రకారం జరగాల్సిందే. విచారణ నిష్పాక్షిక పూర్తికాకుండానే నిందితుడిని దోషిగా పరిగణించలేం. ఒకే తరహా చేసిన నిరారోపణలు ఎదుర్కొంటున్న నిందితులలో కొందరి ఇళ్లు మాత్రమే కూల్చివేయడం.. మరికొందరిపై చర్యలు తీసుకోకపోవడం వంటి అంశాలను కూడా సుప్రీం కోర్టు ధర్మాసనం దృష్టికి వచ్చింది. దీనిపై న్యాయమూర్తులు స్పందిస్తూ.. అధికారులు కేవలం కొందరిని శిక్షించడానికే ఇదంతా చేస్తున్నట్లు నమ్ముతున్నాం. అంతే తప్ప న్యాయం కోసం కాదు. ఒక ఇల్లు కూల్చి వేస్తే.. అందులో ఒక నిందితుడు మాత్రమే కాదు.. అతని కుటుంబ సభ్యులు కూడా నివసిస్తుంటారు. వారంతా ఏ పాపం ఎరుగని వారు. రాత్రికి రాత్రి ఇళ్లు కూల్చేస్తే.. మహిళలు, పిల్లలు నడిరోడ్డుపై ఉండాల్సిన పరిస్థితి. ఒకవేళ ఏదైనా నేరంలో నిందితుడు దోషిగా తేలినా అతడి ఇంటిని కూల్చేసే హక్కు ఎవ్వరికీ లేదు. ఒక వేళ ఇల్లు కూల్చడానికి అన్ని అనుమతులు ఉన్నా.. అందులో నివసించే వారికి 15 రోజులు లేదా స్థానిక చట్టాల ప్రకారం కనీస గడువు తప్పనిసరిగా ఇవ్వాలి. బుల్డోజర్ జస్టిస్ పేరుతో నిందితుల ఇల్లు కూల్చేయడం వెనుక ఉన్న రాజకీయ కారణాలను కోర్టు ఖండిస్తోంది. అధికారులు.. నియమాలను పాటిస్తూ.. చట్ట ప్రకారమే చర్యలు చేపట్టాలి. నిబంధనలకు అతిక్రమించి ఇళ్ల కూలిస్తే.. బాధితులకు నష్టపరిహారం తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది.

## తూతూ మంత్రంగా సర్వే

కొందరయితే నేరుగా తాము ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేది లేదని ఖరాఖండిగా చెప్పేస్తున్నారు. మరికొందరు మాత్రం సమాధానాలను దాటవేసేందుకు ఎక్కువగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సమగ్ర సర్వే కారణంగా తమకు ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు అందకుండా పోతాయోమోనన్న భయం ప్రజల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అదేసమయంలో రేషన్ కార్డులను కూడా తొలగిస్తారన్న ప్రచారంతో పూర్తి సమాచారం చెప్పేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. ఒకటి కాదు రెండు కాదు.. 75 ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంది. బీసీ డిక్లరేషన్ అయితే తమకు ఈ సర్వే వల్ల ఏం లాభం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నవంబరు 6వ తేదీ నుంచి కులగణన సర్వేచేపట్టినా ఇప్పటి వరకూ పెద్దగా సర్వే ముందుకు సాగకపోవడానికి ప్రధాన కారణం బీసీ కులగణన చేపడితే తమ వివరాలను ఎందుకు సేకరిస్తున్నారన్న ప్రశ్నలకు ఎన్యుమరేటర్లకు సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.ఇరవై ఆరు రోజుల పాటు ఈ సర్వే కొనసాగుతుందని తెలిసినప్పటికీ ప్రజలు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం తమకు ఏమాత్రం లాభం లేనిసర్వేకు ఎందుకు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారం సేకరించేందుకు వెళ్లిన వారిపై జనం గరం!

కులగణన అంటూ ప్రభుత్వం.. అయితే అన్ని వివరాలు ఎందుకని ప్రజలు.. ఇలా తెలంగాణ సర్కార్ చేపట్టిన సర్వేకు కష్టాలు తప్పడం లేదు. కులగణన పేరుతో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు అడగడంపై పబ్లిక్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వేపై ప్రజల్లో చాలా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వే కోసం రూపొందించిన ఫార్మాట్ విషయంలో అభ్యంతరాలు తెలుపుతున్నారు జనాలు. సర్వే ఫామ్‌లో నేరుగా 56 ప్రశ్నలు ఉన్నాయి. సబ్‌గా టైటిల్‌గా ఉన్న ప్రశ్నలు లెక్కిస్తే 70కి పైగా అవుతున్నాయి. ఈ ప్రశ్నల్లో చాలావరకు వ్యక్తిగత సమాచారాన్ని అడగటంపై ప్రజలు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా ఆస్తులు..ఉద్యోగస్తుల జీతభత్యాలకు సంబంధించిన ప్రశ్నలు ఉండటంపై పబ్లిక్ మండిపడుతున్నారు. అన్ని వివరాలు ఎందుకు ఇవ్వాలంటూ ఎన్యుమరేటర్లను ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా కాన్ఫిడెన్షియల్‌గా ఉండే ఆస్తులను ఎలా బహిర్గతం చేస్తామంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్తులు, జీతభత్యాల వివరాలను పూర్తిగా చెప్తే ఏమవుతుందో అని భయం వెంటాడుతోంది. మరోవైపు ఈ పూర్తి సమగ్ర సమాచారంతో..ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కోత విధిస్తారేమోనని అనుమానం వ్యక్తమవుతోంది.వృద్ధాప్య పెన్షన్లు, రేషన్ కార్డులకు అనర్హత విధిస్తారేమోనన్న ఆందోళనలో ఉన్నారు జనం. అందుకే సర్వే విషయంలో ప్రజల నుంచి అంత సానుకూలత వ్యక్తం కావడం లేదనే టాక్ వినిపిస్తోంది. గతంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఉండగానే మళ్లీ కొత్తగా సర్వే చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ కుల సర్వేనే చేయాలనుకుంటే ఈ వ్యక్తిగత ఆదాయానికి సంబంధించిన ప్రశ్నలు ఏంటి అంటూ నిలదీస్తున్నారు.కులగణన పేరుతో చేస్తున్న ఇంటింటి సర్వేపై ప్రజల నుంచి భిన్నమైన వాదన వినిపిస్తుండటంతో సర్కారు పెద్దలు రంగంలోకి దిగుతున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా రంగంలోకి దిగి సర్వే పట్ల ప్రజలు అనుమానం పడాల్సిన అవసరం లేదంటూ భరోసా కల్పించే ప్రయత్నం చేశారు.మంత్రి హుస్నాబాద్ పట్టణంలో ఎన్యుమరేటర్స్‌తో కలసి స్వయంగా సర్వేలో పాల్గొని వివరాలు నమోదు చేశారు. ప్రజా ప్రతినిధులు ఇంటింటి కుటుంబ సర్వేలో భాగస్వామ్యులు కావాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. సర్వే ద్వారా మీ కుల బలమెందో తెలిస్తే సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక వేయడానికి అవకాశం ఉంటుందని సర్వేకు సహకరించాలని కోరుతున్నారు. ఈ సమగ్ర సర్వే ద్వారా ఎవరెంతో వారికంత ఆలోచనలతో తేడాలు సరిచేయడానికి ఉపయోగపడుతుందని చెప్తున్నారు.ప్రభుత్వం వివరణ ఎలా ఉన్నా.. ప్రజలు మాత్రం ఎన్యుమరేటర్లకు అన్ని వివరాలు చెప్పడం లేదు. కొందరు అయితే కనీస వివరాలు ఇచ్చేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. ఉద్యోగాలు, జీతాలు, అకౌంట్ నెంబర్లు, ఆస్తుల వివరాలు అడగటం వెనక ఏదో కహాని ఉందని మండిపడుతున్నారు. ఇచ్చిన హామీలనే అమలు చేయకుండా ఇప్పటికే వస్తున్న పథకాలకు కోత పెట్టే కుట్ర జరుగుతుందంటూ జనం తిట్లదండకం అందుకుంటున్నారు. వ్యక్తిగత ఆస్తులు ఆదాయం వంటి అంశాలను సర్వే నుంచి పక్కన పెట్టాలని కోరుతున్నారు.ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలను కూడా ప్రజల్లో పెద్దగా పరిగణలోకి తీసుకోవడం లేదట. ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలకు ఇష్టమనిపిస్తే సమాధానం చెప్తున్నారట. లేకపోతే లైట్ తీసుకుంటున్నారట. కొందరు అయితే అన్ని వివరాలు ఇస్తున్నారు. ఇదేంటి సర్వే అన్నప్పుడు అందరి దగ్గర అన్ని వివరాలు తీసుకోవాలి కదా. కొందరు వివరాలు ఇవ్వడం లేదు. మరికొందరి దగ్గర అన్ని వివరాలు తీసుకుంటున్నారు ఇదెక్కడ లెక్క అంటూ పబ్లిక్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వే కష్టాలను ప్రభుత్వం ఎలా అధిగమిస్తుందనేదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# కాషాయ దళ పతి రేసులో నలుగురు

రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఆ నలుగురు నేతల లాబీయింగ్.. సంస్థాగత ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. బూత్ స్థాయి నుంచి మొదలుకుని రాష్ట్ర, జాతీయ అధ్యక్షుడి వరకు ఎన్నికల ప్రక్రియ ద్వారా నియామకం జరగనుంది. డిసెంబర్ నెలాఖరున రాష్ట్ర అధ్యక్ష పదవికి, జనవరిలో జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగే అవకాశముంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు జాతీయ అధ్యక్షుడు ఎవరవుతారనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో కనిపిస్తోంది. అయితే రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే నలుగురు నేతలు లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



## రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఆ నలుగురు నేతల లాబీయింగ్..

**అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయనను తప్పించడం వల్ల జరిగిన డ్యామేజ్ ను కంట్రోల్ చేసుకోవాలంటే తిరిగి మళ్లీ సంజయ్ నే ప్రెసిడెంట్ చేయాలన్న వాదన వినిపిస్తోంది. ఇక మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. బండి సంజయ్ ని అధ్యక్షుడిగా తప్పించి.. కిషన్ రెడ్డికి బాధ్యతలు ఇచ్చే సమయంలోనే ఈటల ప్రెసిడెంట్ అవుతారని చర్చ జరిగింది. కానీ ఆయనకు బాధ్యతలు ఇవ్వలేదు. అయితే ఈటల రాజేందర్ ని పార్టీ ప్రెసిడెంట్ చేస్తే బీసీకి అవకాశం ఇచ్చినట్లు ఉంటుందని పార్టీ భావిస్తున్నట్లు టాక్.**

✍ **జయభేరి, హైదరాబాద్, నవంబర్ 13:**

ఈ నేపథ్యంలో బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ ఎవరు అవుతారనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ గా పనిచేసి.. ఇప్పుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతోన్న బండి సంజయ్ కు మరోసారి పార్టీ అధ్యక్ష పగ్గాలు దక్కుతాయనే టాక్ వినిపిస్తోంది. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాక పార్టీలో జోష్ వచ్చిందంటున్నారు ఆ పార్టీ నేతలు. ఆయన ఆధ్వర్యంలోనే దుబ్బాక, హుజురాబాద్ బైపోల్ లో విజయంతో పాటు గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటామంటున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మీద గట్టిగా పోరాడిన నేతగా సంజయ్ కు క్యాడర్లో గుర్తింపు ఉంది. ఇప్పుడు మళ్లీ గ్రేటర్ ఎన్నికలు వస్తుండటంతో పాటు పార్టీ అధికారంలోకి వచ్చేంత పటిష్టం కావాలంటే సంజయ్ ను అధ్యక్షుడిని చేస్తేనే బాగుంటుందన్న అభిప్రాయాలున్నాయి.అసెంబ్లీ ఎన్నికలకు ముందు సడెన్ గా ఆయనను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడంతో బీజేపీ క్యాడర్ నిరుత్సాహానికి గురైంది. కట్టర్ బీజేపీ నేతగా.. మాస్ లీడర్ గా సంజయ్ కు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. అందుకే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయనను తప్పించడం వల్ల జరిగిన డ్యామేజ్ ను కంట్రోల్ చేసుకోవాలంటే తిరిగి మళ్లీ సంజయ్ నే ప్రెసిడెంట్ చేయాలన్న వాదన వినిపిస్తోంది.

ఇక మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. బండి సంజయ్ ని అధ్యక్షుడిగా తప్పించి.. కిషన్ రెడ్డికి బాధ్యతలు ఇచ్చే సమయంలోనే ఈటల ప్రెసిడెంట్ అవుతారని చర్చ జరిగింది. కానీ ఆయనకు బాధ్యతలు ఇవ్వలేదు. అయితే ఈటల రాజేందర్ ని పార్టీ ప్రెసిడెంట్ చేస్తే బీసీకి అవకాశం ఇచ్చినట్లు ఉంటుందని పార్టీ భావిస్తున్నట్లు టాక్.ఇక మరో నేత.. మెదక్ ఎంపీ రఘునందన్ రావు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ఉన్నారు. ఆయన బీజేపీలో పుట్టి పెరిగిన నేత కాకపోయినా..ఆ పార్టీలో చేరగానే.. సిద్ధాంతాలను అడాప్ట్ చేసుకుని..ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చిన నేతలా పార్టీ కోసం గళం వినిపిస్తుంటారు. అంతేకాదు ప్రశ్నించే గొంతుగా రఘునందన్ కు ప్రజల్లో గుర్తింపు ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దుబ్బాకలో ఓడినా పట్టుబట్టి మెదక్ ఎంపీ టికెట్ తెచ్చుకుని గెలిచి సత్తా చాటారు రఘునందన్. ఇప్పుడు అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే.. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని ఆయన చెప్తున్నట్లు తెలుస్తోంది.బీజేపీ సీనియర్ లీడర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు కూడా పార్టీ అధ్యక్ష రేసులో ఉన్నారు. ఆయన పార్టీలో మొదటినుండి ఉన్న సీనియర్ నేత. గ్రేటర్ బీజేపీ ప్రెసిడెంట్ గానూ పనిచేసిన అనుభవం ఉంది. ఒకవేళ ఆయనకు పార్టీ ప్రెసిడెంట్ పగ్గాలు అప్పగిస్తే..ఎలా ఉంటుందని కూడా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా కాషాయ దళపతి రేసులో ఉన్నట్లు టాక్ నడుస్తోంది.ఆశావహులు ఎక్కువగా ఉండటంతో..సామాజిక సమీకరణాలు.. రాజకీయ పరిస్థితులపై లెక్కలు వేసుకుంటుందట పార్టీ హైకమాండ్. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ నేతకు అవకాశం ఇస్తే బాగుంటుందనే దానిపై కసరత్తు చేస్తుందట. అధిష్టానం ఆలోచన ఎలా ఉన్నా నేతల లాబీయింగ్ మాత్రం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి బీజేపీ హైకమాండ్ ఎలాంటి ముగింపు ఇస్తుందో చూడాలి.

## అమోయ్‌కుమార్ భూలీలలలు

బయటకు తీయాలని సీఎంవో నుంచి ఆదేశాలు వెళ్లినట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.ధరణికి ముందు ఆ తర్వాత ఉన్న ల్యాండ్ వివరాలను పోల్చి చూడాలని ఆదేశాలు వెళ్లినట్టు తెలుస్తోంది. ధరణిలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకుని ప్రైమ్ ఏరియాలో కోట్లాది రూపాయల విలువ చేసే భూములను తక్కువ ధరకి ప్రైవేట్ వ్యక్తుల పేరిట మార్చారన్నది ఆయనపై ప్రధాన ఆరోపణ.భూముల వ్యవహారంపై రెవిన్యూ, ఎండోమెంట్, ఫారెస్ట్ అధికారులు రంగంలోకి దిగేశారు. వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ధరణికి ముందు ఆ తర్వాత భూముల్లో చాలా వ్యత్యాసం ఉన్నట్లు కనిపిస్తోంది.2014 ముందు ప్రభుత్వ భూములు ఎంతమేరకు ఉన్నాయో తెలియని పరిస్థితి. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కింద సుమారు 35 వేల ఎకరాల భూముల వివరాలు ధరణిలో నమోదు కాలేదు. వాటితోపాటు అసైన్డ్ భూముల వివరాలను అధికారులు పైకి తీస్తున్నారు. కొద్దిరోజుల కిందట ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యత ఎన్ఐసీకి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గత ప్రభుత్వంలో జరిగిన భూముల అక్రమాల వెలికి తీత మరింత సులభమని అవుతుందని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.

## ఏపీలో మహిళలకు నెలకు రూ.1500

సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వరుసగా అమలు చేస్తూ వస్తుంది. ఇప్పటికే పలు హామీలను అమలు చేస్తుంది. ఇటీవల ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసింది. అలాగే ఈ ఏడాది మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని సైతం ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. మరోవైపు గత జగన్ ప్రభుత్వ హయాంలో.. పలు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు కోట్లాది రూపాయిలు ఇచ్చింది. అదీ కూడా అప్పు చేసి మరి ఇలా ప్రభుత్వం ఇవ్వడంతో.. ఖజానా ఖాళీ కావడం దేవుడెరుగు. ఈ పథకాల కోసం తెచ్చిన నగదుకు వడ్డీలకు వడ్డీలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ప్రభుత్వం వద్ద పైసా నగదు లేన్న సంగతి అందరికీ తెలిసిందే.

## వికారాబాద లో టెన్షన్.. టెన్షన్

పట్నం నరేందర్‌రెడ్డికి ఫోన్ చేసిన విషయాన్ని గుర్తించారు. మంగళవారం నుంచి ఈవిషయంలోనే పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి కూడా సురేష్ తమ కార్యకర్తేనంటూ ఒప్పుకున్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు కారణంగా తన ఏడు ఎకరాలు పోతుందనే బాధలో ఉన్నాడని వివరించారు. అక్కడ ప్రజలందరితో కలిసి సురేష్ కూడా ప్రజాభిప్రాయాన్ని బహిష్కరించడానికి పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణ బహిష్కరించిన వారిలో అన్ని పార్టీల వాళ్లు ఉన్నారని కానీ పోలీసులు కేవలం బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేసుకుంటున్నారని మండిపడ్డారు.



సురేష్‌లాంటి కీలకమైన కార్యకర్తలు ఏన్నో సమస్యల చెప్పుకునేందుకు తరచూ ఫోన్ చేస్తుంటారని పట్నం నరేందర్ రెడ్డి వివరించారు. అంతమాత్రాన కుట్ర చేసినట్టు ఎలా అవుతుందని అన్నారు. ప్రభుత్వం కావాలనే ఇందులో బీఆర్ఎస్ నేతలను శ్రేణులను ఇరికించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అక్కడ ప్రజలు చాలా కాలంగా తమ గోడు చెబుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి వినిపించుకోలేదన్నారు. ఇప్పటికే 50 మందికిపైగా వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు సురేష్ కోసం గాలిస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అరెస్టు చేసిన వారిలో కొందర్ని రిమాండ్‌కు తరలించారు. మిగతా వారిని స్టేషన్ బెయిల్ ఇచ్చి విడిచి పెట్టారు. లగచర్లతోపాటు దుద్యాల, కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. ఇంటర్‌నెట్ సేవలు పూర్తిగా నిలిపివేశారు.

## బీఆర్ ఎస్ నేతలే చేశారు

లగచర్ల ఘటనపై అధికారవిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. కేటీఆర్ చేసిన కామెంట్లపై మండిపడ్డారు సీఎం రేవంత్ బ్రదర్ తిరుపతిరెడ్డి. సీఎం రేవంత్‌రెడ్డి పేరు ప్రతిష్టలు దెబ్బతీసేందుకే హరీష్‌రావు, కేటీఆర్‌లు ఇలాంటివి చేస్తున్నారని ఆరోపించారుఅధికారులపై దాడి ఘటనలో ముమ్మాటికీ బీఆర్ఎస్ శక్తులు పని చేశాయన్నారు. నిందితులు ఎంతటి వారైనా సరే పోలీసులు అరెస్ట్ చేసి తీరుతారన్నారు. ఘటనలో గాయపడిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, మిగతా అధికారులను బుధవారం ఆయన పరామర్శించారు.

అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంటే అమాయకులను రెచ్చగొట్టారని అన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.హరీష్‌రావు మాదిరిగా మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ కోసం రాత్రికి రాత్రే గ్రామాలను ఖాళీ చేయించి రైతులను వేధించలేదన్నారు. అమాయక రైతులను డబ్బులిచ్చి మరి రెచ్చగొట్టారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కొడంగల్ అభివృద్ధి ఆగదని, ఈ నియోజకవర్గంలో కంపెనీలు రావడం ఖాయమన్నారు.అమాయక రైతులపై కేసులు పెట్టలేదని, దాడిలో పాల్గొన్నవారిపై మాత్రమే కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. దాడులు ప్రేరేపించిన వారిని ఎవరినీ వదిలి పెట్టేదిలేదన్నారు సీఎం రేవంత్ బ్రదర్ తిరుపతిరెడ్డి.

**ప్రజలు గమనిస్తున్నారు - కేటీఆర్**

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి కేసు రాజకీయ రంగు పులుముకుంది. ఈ వ్యవహారంపై అధికార కాంగ్రెస్‌విపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరిపాకాన పడింది. దాడి వెనుక ఎవరున్నా వదిలిపెట్టేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేసిన 10 గంటల్లోపే మాజీ ఎమ్మెల్యేని అరెస్ట్ చేశారు పోలీసులు. దీంతో బీఆర్ఎస్ కీలక నేతల్లో వణుకు మొదలైంది. వికారాబాద్‌లోని డీటీసీ సెంటర్‌లో పట్నం నరేందర్‌రెడ్డిని ఉంచారు. ఆయనను జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఘటనకు సంబంధించిన డీటేల్స్ దగ్గర పెట్టి విచారణ మొదలుపెట్టారు. విచారణ అనంతరం వైద్యులను పిలిపించి పరీక్షలు చేయనున్నారు. డీటీసీ సెంటర్ నుంచి నేరుగా కోర్టులో హాజరు పరచనున్నారు పోలీసులు.

ఘటన కేసులో జరుగుతున్న పరిణామాలతో బీఆర్ఎస్ ఉలిక్కిపడింది. పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్‌పై మాజీ మంత్రి కేటీఆర్ రియాక్ట్ అయ్యారు. పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్‌ని తీవ్రంగా ఖండించారు. ఆయనను, లగచర్లలో అరెస్ట్ చేసిన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎప్పటిమాదిరిగానే రేవంత్ సర్కార్‌పై బురద జల్లే ప్రయత్నం చేశారు. ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ ఇలాంటి నిర్బంధాలు, అక్రమ అరెస్ట్‌లు ఎన్నో చూసిందన్నారు. ప్రజల తరపున పోరాటం చేస్తుంటే బీఆర్ఎస్ నేతలను అరెస్ట్‌లతో భయపెట్టాలని చూస్తే అది మూర్ఖపు చర్యే అవుతుందని ఎక్స్‌లో ప్రస్తావించారు.దాడి కేసులో జరుగుతున్న పరిణామాలను ఆ పార్టీ నేతలు గమనిస్తున్నారు. దీనిపై నోరు ఎత్తితే ఎటు వైపు టర్న్ అవుతుందోనని ఆలోచన చేస్తున్నారు. పోలీసులకు ఆధారాలు లభించిన తర్వాత, నోరు ఎత్తి ఇబ్బందిపడే బదులు సైలెంట్‌గా ఉండడమే మంచిదన్న అభిప్రాయం కొందరి నేతల మాట. మొత్తానికి విచారణలో నరేందర్‌రెడ్డి నోరు విప్పితే అసలు గుట్టు బయట పడుతుందని అంటున్నారు

# సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్ష సమావేశం

■ సర్వే సమయంలో అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలి




జయభేరి, నవంబర్ 13:

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సర్వేకు వచ్చే సమయాన్ని ముందుగానే కుటుంబాలకు తెలిపి, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సర్వే నోడల్ అధికారులకు సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో కుటుంబ సర్వే, ధాన్య సేకరణ అంశాల పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తో కలిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి హోదాలో దివ్యా దేవరాజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అందుబాటులో లేని కుటుంబ సభ్యులకు ముందుగానే సర్వే సమయాన్ని, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో పెట్టుకునేలా ఎన్యుమరేటర్ల ద్వారా ఇంటింటికి తెలిపేందుకు చర్యలు తీసుకోవాలని సర్వే నోడల్ అధికారులకు సూచించారు. ఎన్యుమరేటర్లు డాక్యుమెంట్లు చూసి తప్పులు జరుగకుండా ప్రొఫార్మాలను పూరించాలని, ఏదైన సందేహం ఉంటే సూపర్ వైజర్, నోడల్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేసుకొని సర్వే నిర్వహించాలన్నారు. ఈ జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున వారు స్వచ్ఛందంగా కోరిన చోట నమోదు చేయించాలన్నారు. ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యులతో సౌమ్యంగా మాట్లాడి సమాధానాలు తెలుసుకుంటూ, ప్రత్యక్షంగా పరిశీలించిన అంశాలను ప్రొఫార్మాలో కొంత వరకు పూరించాలని అన్నారు. సర్వే నిర్వహణలో కలిగే సమస్యలను నోడల్ అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. అంతకు ముందు జిల్లా నోడల్ అధికారులతో తమ పరిధిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎదురయ్యే ఇబ్బందులను, సమస్యలను నోడల్ అధికారులతో అడగి తెలుసుకున్నారు. జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలు ఉన్నందున, సర్వే పూర్తి కావడానికి మరి కొంత సమయం అవసరమవుతుందని కలెక్టరు తెలిపారు. ఈ సమవేశంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, ఆర్డిఓలు సైదులు, శ్యాం ప్రకాష్, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖధికారి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరా శాఖ డిఎం సుగుణబాయి, జిల్లా యువజన అధికారి గోపాల్ రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా పరిశ్రమలశాఖాధికారి ప్రశాంత్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబు మోసిస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## బస్ సౌకర్యం కోసం వినతి

జయభేరి, గజ్వేల్, నవంబర్ 13 :

విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడం తో బెజుగామ చిన్నఆరెపల్లి, బయ్యారం గ్రామలకు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నరాని బస్సు సౌకర్యం కల్పించాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ కు బిజెపి మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మెమోరాండం అందజేశారు. దీనిపై డిపో మేనేజర్ సానుకులంగా స్పాందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి రామగిరి నవీన్ మండల ఉపాధ్యక్షులు బారు అరవింద్, మండల నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## హంస హోమియోపతిలో మధుమేహ వ్యాధి ఉచిత చికిత్స




జయభేరి, గజ్వేల్, నవంబర్ 13 :

హంస హోమియోపతి వైద్య కళాశాల ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఆధ్వర్యంలో నవంబర్ 14న హంస హోమియోపతి వైద్య కళాశాలలో మధుమేహ వ్యాధి అవగాహన కార్యక్రమం మరియు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమేశ్ అక్కలదేవి తెలియజేశారు. ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స మరియు మందుల పంపిణీ చేస్తారని తెలిపారు. అదనంగా, హంస హోమియోపతి వైద్య కళాశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన అత్యాధునిక అల్ట్రాసౌండ్ దయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా ప్రజలకు అధిక నాణ్యత గల వైద్య సేవలు అందించబడుతున్నాయని తెలిపారు. పరిమిత కాలానికి తక్కువ ఖర్చులో ఈ సేవలను పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎఫ్డిసి



జయభేరి, జగదేవపూర్, నవంబర్ 13 :

జగదేవపూర్ గ్రామానికి చెందిన మీటివి రిపోర్టర్ తండ్రి కొంపల్లి శివరాం సత్తయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ ఎఫ్డిసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పీఏసిఎస్ చైర్మన్ ఇంద్రాసేన రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ కోఆప్షన్ ఇక్బాల్, మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాలకిషన్, నాయకులు ఐలయ్య, కనకయ్య, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


## కేశవరంలో ఇంటింటికి భగవద్గీత పంపిణీ

■ హిందువులకు పవిత్ర గ్రంథం భగవద్గీత - మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్



జయభేరి, నవంబర్ 13:

మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో పవిత్ర గ్రంథం భగవద్గీతను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్టియన్ సోదరులకు బైబిల్ , ముస్లిం సోదరులకు ఖురాన్, హిందూ సోదరులకు భగవద్గీత అలాంటిదని అన్నారు. భగవద్గీత చదవడం చాలా ముఖ్యమని, అన్నారు. నరుడి అభ్యున్నతికి నారాయణుడు బోధించిన జీవనసారం గీత అన్నారు. ప్రతి మనిషినీ మహోన్నతుడిగా తీర్చిదిద్దడానికి శ్రీకృష్ణుడు పూరించిన శంఖారావం భగవద్గీత అన్నారు. అర్జునుడిని శిష్యుడిగా ఎంచుకొని తాను ఆచార్యుడిగా ప్రామాణిక మానసిక వికాస సూత్రాలను అందించాడు కాబట్టీ అందరూ భగవత్గీత చదవాలని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో కేశవరం మాజీ ఎంపిటిసి గోనే హనుమంత రెడ్డి, ఏలూరి కొమరయ్య, బొమ్మలపల్లి మల్లేష్ ఉడతల కృష్ణ, బలరాం చారి, శ్రీనివాస్ రెడ్డి, బొమ్మలపల్లి శ్రీశైలం, సుధాకర్, రామస్వామి, బొమ్మలపల్లి మైసయ్య, భూమేష్, లక్ష్మీనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.



## హామీలు మరిచి ప్రజలకు కన్నీరు మిగిల్చింది

■ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దరం గురువా రెడ్డి



జయభేరి, ములుగు, నవంబర్ 13 :

తెలంగాణ ప్రజల తలరాతలు మారుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా విస్మరించిందని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దరం గురువా రెడ్డి అన్నారు. బుధవారం ములుగు మండల పరిధిలోని చిన్నతిమ్మాపూర్ లో బిజెపి మండల శక్తి కేంద్రాలు బూత్ అధ్యక్షుల పునర్నిర్మాణం కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారత్ వైపు చేసిన ఘనత భాజపా ,దేశ ప్రధానికి దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను మరిచి పేదలకు కన్నీరు మిగిల్చిందన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలులో జాప్యం, వడ్లకు బొనస్ ఇస్తామని చెప్పి రైతన్నలకు సైతం మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిసారించి ఆదుకోవాలనీ గురువా రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల సహయోగి, జిల్లా కార్యదర్శి శశిధర్ రెడ్డి, నరేందర్ విజయ లక్ష్మి (మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు) కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొండు నర్సింలు మండల, పుల్లబోయిన బాబు, మహేష్ గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి నక్కహరి, జిల్లా ఓబీసీ అధికార ప్రతినిది అన్నెబోయిన యాదగిరితో పాటు ఆయా గ్రామాల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## వ్యక్తి మరణానికి కారణమైన డ్రైవర్ కు జరిమానా

జయభేరి, ములుగు, నవంబర్ 13 :

అజాగ్రత్తగా వాహనం నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన వ్యక్తికి న్యాయస్థానం రూ.10వేల జరిమాన విధించినట్లు ములుగు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

2016 లో సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి వద్ద రాజీవ్ రహదారిపై విధులు నిర్వహిస్తున్నన్న జమ్మికుంట ప్రాంతానికి చెందిన వ్యక్తి కి అదే సమయంలో కరీంనగర్ జిల్లా కు చెందిన కుమారస్వామి అజాగ్రత్తగా నడుపుతూ కారుతో మోహన్ రావును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో మోహన్ రావు అక్కడికక్కడే మృతి చెందాడు.

2016 లో కుమారస్వామిపై ములుగు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ చేశారు.

బుధవారం ఈ కేసు గజ్వేల్ న్యాయస్థానంలో విచారణకు రాగా న్యాయమూర్తి ప్రియాంక కుమారస్వామికి రూ.10వేల జరిమానా విధించారాని ఎస్సై తెలిపారు.



## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని KL Reddy Nagar వద్ద INTER SCHOOL'S BOX Cricket TOURNAMENT 2024 ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇక్రిశాట్ ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగహన

■ శాస్త్రీయ పద్ధతుల్లో రైతులు పంటల సాగు చేయాలని సూచన




జయభేరి, నవంబర్ 13:

కేశవరం గ్రామంలో ఇక్రిశాట్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత శాస్త్రీయ పద్దతిలో కనుగొన్న యంత్రాల ద్వారా భూసారా పరీక్షల ద్వారా వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటించి రైతులు మంచి పంట దిగుబడిని సాధించి లాభాలను గడించాలని సూచించారు. అదేవిధంగా కేశవరం, జగంగూడ, నాగిశెట్టిపల్లి గ్రామాలలో భూసారా పరీక్షలు నిర్వహించి వారి భూముల్లో ఏయే పంటలు పండించాలనేది పత్రాల రూపంలో రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఇక్రీసాట్ అధికారులు, కేశవరం మాజీ ఎంపిటిసి గోనే హనుమంత రెడ్డి, రైతులు ఏలూరి కొమరయ్య, బొమ్మలపల్లి మల్లేష్, ఉడతల కృష్ణ, బలరాం చారి, శ్రీనివాస్ రెడ్డి, బొమ్మలపల్లి శ్రీశైలం, సుధాకర్, రామస్వామి, బొమ్మలపల్లి మైసయ్య, భూమేష్, లక్ష్మీనారాయణ గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రియాశీల సభ్యత్వలతో పార్టీ మరింత బలోపేతం

■ భాజప రాష్ట్ర నాయకులు ఏర్పుల వెంకటరమణ




జయభేరి, గజ్వేల్, నవంబర్ 13 :

భారతీయ జనతా పార్టీ జగదేవపూర్ శాఖ సంస్థగత ఎన్నికల కార్యశాలిలో భాగంగా మండల అధ్యక్షులు దాసరి ఐలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలొ ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు ఏర్పుల వెంకటరమణ మరియు సీనియర్ నాయకులు కప్పర ప్రసాద్ రావు, ఎల్లు రామ్రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కూడిక్యాల రాములు పాల్గొని బీజేపీ పార్టీ బూత్ స్థాయిలొ జరిగిన పార్టీ సభ్యత్వం కార్యక్రమం గురించి క్రియాశీలన సభ్యత్వాల గురించి వివరాలు తీసుకోని రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్ల గురించి మండల గ్రామ స్థాయి నాయకులకు దిశా నిర్దేశం చేసి సిద్ధంగా ఉండాలని, మండలంలొ అత్యధిక స్థానాలు కైవాసం చేసుకోనేలా ప్రణాళిక ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలొ జిల్లా ఓబీసీ జనరల్ సెక్రెటరీ కోదండం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు గుర్రం శ్రీధర్, సోషల్ మీడియా లంబ నాగరాజు, మరియు మేడా అజిత్ రెడ్డి, మండల యువమోర్చా అధ్యక్షులు నర్రా రాజ్ కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు భీమరి గణేష్, మండల ఉపాధ్యక్షులు కొంతం సుధాకర్, కోమరోజు హరికృష్ణ చారి, మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

■ బూత్ కమిటీల నియామకం త్వరలోనే నిర్వహిస్తాం



జయభేరి, వర్గల్, నవంబర్ 13 :

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భాజపా రాష్ట్ర నాయకులు ఏల్లు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు బాల్ రెడ్డీ తెలిపారు. మండల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా బిజెపి 2024 సభ్యత్వ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని బిజెపికి మద్దతుగా గ్రామాల నుండి అధికమందుతూ వస్తుందని వెల్లడించారు. క్రియాశీల సభ్యత్వాల కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. త్వరలో గ్రామస్థాయిలో బూత్ కమిటీలు నిర్వహిస్తామని అందుకుగాను అభిప్రాయ సేకరణ తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన ప్రతిష్టాత్మకమైన పథకాలను ప్రజల్లోకి చేరివేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీరామ్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిలు వెంకటేష్ గౌడ్, పంపారి రమేష్, ఉపాధ్యక్షుడు రంగు ప్రదీప్ గౌడ్, సభ్యత్వ కన్వీనర్ తిరుపతిరెడ్డి, కో కన్వీనర్ రవీందర్ గౌడ్, కిసాన్ మోర్చా దిండి నాగరాజు, ఎర్రి బుచ్చిరెడ్డి, నరేందర్ రెడ్డి సీనియర్ నాయకులు మఠం మహిపాల్, నూక బద్రీనాథ్, సుధాకర్ రెడ్డి, రాజేష్, జంగం సంజీవులు, జగన్, శ్రీపతి, కర్ణాకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి



## మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత

జయభేరి, గజ్వేల్, నవంబర్ 13 :

కొండపాక మండలం జప్తినాచారం గ్రామానికి చెందిన పబ్బోజు రాజుచారి ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. రాజుచారి మరణం చాలా బాధాకరం అని, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం వారి సోదరుడు కొమ్ము మల్లేశం యొక్క సహకారంతో క్వింటల్ బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఏం.నర్సింలు, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు కిషన్, వీరబ్రహ్మం, బాల్ రాజు, మల్లయ్య, సంజీవ్, విష్ణు, కర్ణాకర్, కృష్ణ, నాగరాజు..తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కార్యక్రమం

■ కార్యక్రమంలో పాల్గొన్న మండల ఎంపీపీ, జడ్పీటీసీ



జయభేరి, పరవాడ:

పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరవాడ మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక జి.ఆర్. డి.పి తయారీ పై బుధవారం మండల ఎం.పి.టి.సి లకు, సర్పంచ్ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ.ఓ.పి. ఆర్ &ఆర్.డి ధర్మారావు సభ్యులకు గ్రామ అభివృద్ధి ప్రణాళికలు ఏ విధంగా తయారు చేయాలని, అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఏ విధంగా ఖర్చు చేయాలో అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి మండలం లో గల అన్ని పంచాయతీలకు సంబంధించి 2025 26 కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అత్యవసర పనులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసి పంచాయతీలలో అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ జడ్పిటిసి పి. ఎస్ రాజు ,వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పరవాడ మండలం సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకొన్న ప్రజానీకం




జయభేరి, పరవాడ :

అనకాపల్లి జిల్లా అందత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్ మరియు అనిత ఆప్టికల్స్, సాన్విక మెడికల్ అండ్ జనరల్ స్టోర్ ఆధ్వర్యంలో బుధవారం శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్ అనిత ఆప్టికల్స్, పరవాడ కాటా ఎదురుగా సినిమా హాల్ జంక్షన్ నందు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి చుట్టూ పక్కల గ్రామాలు నుంచి విశేష స్పందన కనిపించింది. ఈ వైద్య శిబిరంలో మొత్తము 187 మంది పరీక్షలు చేయ్యించుకొన్నారు అందులో కంటి చికిత్స 67 మందికి అవసరం అని కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె గోపికృష్ణ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయబడ్డాయి అని ,శుక్లము ఆపరేషన్ కు ఎంపికైన నిరుపేదలకు డాక్టర్ సూచన మేరకు కాటారక్ట్ శాస్త్ర చికిత్స (లెన్స్) ఉచితంగా అమర్చి ఆపరేషన్ చేయబడుతుందని ఈ శిబిరంలో కంటి ఆపరేషన్ కి ఎంపికైన వారిని ఆపరేషన్ కొరకు శంకర్ ఫౌండేషన్కి పంపించడం జరిగిందని ఆయన తెలియ జేశారు.

## సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

■ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :



జిల్లాలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, మరియు కుల సమగ్ర సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని చిట్యాల మండలం, నైనిపాక బీసీ కాలనీలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఫారంను పరిశీలించారు. ఎలాంటి పొరపాటుకు తావులేకుండా తావు లేకుండా కుటుంబాల సమగ్ర సమాచారం నమోదులు చేయాలని సూచించారు. ఈ గ్రామ పరిధిలో 790 గృహాలున్నాయని, వీటిని 5 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించి సర్వే చేసేందుకు ఐదుగురు సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు కనీసం 20 ఇండ్లకు తగ్గకుండా సర్వే చేయాలని సూచించడమేకాక, సర్వేలో వేగాన్ని పెంచాలని సూచించారు. సర్వే మెటీరియల్‌ను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. సర్వే డేటా ఎంట్రీ కోసం ఆపరేటర్లను నియమించాల్సిందిగా ఆయన సూచించారు. సర్వే ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్ కార్యదర్శి విష్ణు వర్ధన్ ను అభినందించారు. ఇదే ఉత్సాహంతో కేటాయించిన అన్ని ఇండ్లను పకడ్బందీగా సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, తహసిల్దార్ హేమ, ఎంపీడీవో జయశ్రీ, ఎంపీఓ రామకృష్ణ, కార్యదర్శి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సంకల్పంతో యువతను మేలు కొల్పుతున్న అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ




జయభేరి, పరవాడ:

విద్యార్థులు, యువతను సన్మార్గంలో నడిపి వారిలో వ్యక్తిత్వ వికాశం కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చి ఉన్నత లక్ష్యాలను సాధింప జేసేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సబ్ డివిజన్ల పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో వివిధ జిల్లాలో స్కూల్స్ మరియు కాలేజీల్లో సంకల్పం కార్యక్రమాన్ని పోలీస్ శాఖ నిర్వహిస్తుంది. మాదక ద్రవ్యాల వినియోగం యువతపై ఏవిధంగా చెడు ప్రభావాన్ని చూపిస్తున్నది వారి జీవితాలను, కుటుంబాలను ఏవిధంగా అస్తవ్యస్తం చేస్తున్నదన్న విషయాలు సులువుగా అర్ధమయ్యే విధంగా పోస్టర్లు, పాంప్లెట్లు, బ్యానర్లు సంబంధిత స్కూల్, కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసి చిన్న చిన్న వీడియోలను ప్రదర్శిస్తు అదే విధంగా మత్తు పదార్థాలు యువత శరీరం నాడీ వ్యవస్థపై దుష్ప్రభావాన్ని ఏవిధంగా చేస్తుందో పవర్ పాయింట్ ప్రజెంటేషనుతో వివరించి యువతలో చైతన్యం తీసుకొని వచ్చేందుకు మాదకద్రావ్యలు తీసుకోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయూస్తున్నారు. డ్రగ్స్ అమ్మేవారి సరఫరా చేసేవారి సమాచారం 93929 18196 ఫోన్ చేసి, వాట్సాప్ ద్వారా సామాజిక బాధ్యతగా తెలియజేయాలని తెలిపారు.






## పరవాడ భవిత కేంద్రాన్ని సందర్శించిన జిల్లా విద్యాశాఖధికారి

జయభేరి, పరవాడ:



మండల కేంద్రం అయ్యిన పరవాడలో ఉన్న భవిత కేంధ్రాన్ని జిల్లా విద్యాశాఖధికారి డి ఈ వో అప్పారావునాయుడు సందర్శించి కేంద్రంలో ఉన్న సదుపాయలను పరిశీలిచారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్షణ వారు అందిస్తున్న కార్యక్రమాలు, అలివేన్స్ గురించి వివరించారు.అలాగే దివంగులుతో అక్కడ సదుపాయాలు గురించి అడిగి తెలుసుకొన్నారు దాతలు వితరణ చేసిన వాటర్ డిస్పాన్సర్ ప్రాంభించారు తరువాత కేంద్రంలో పచ్చని మొక్కలు ఉండడం పర్యావరణకి ఎంతో మేలు చేస్తుందని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత సమానవ్యకర్త బి శంకుతల, మండల విద్యాశాఖధికారి ఎమ్ సాయి శైలజ, ఎమ్ వి ఫౌండేషన్ సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు టి కుమార్, జి శ్రీనివాసరావు మరియు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.




## అభయాంజనేయ స్వామి వారి ఆలయ 11వ వార్షికోత్సవలు

■ ముఖ్య అతిధులుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, మండల వైకాపా నాయకులు


జయభేరి, పరవాడ:



పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ నందు ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ 11 వ వార్షికోత్సవాలు సందర్భంగా మాజీ మంత్రి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి, సత్కరించారు.

ఈ సందర్భంగా గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా అభయాంజనేయ స్వామి వారికి పూజ కార్యక్రమాలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా తనను ఆహ్వానించినందుకు చాలా ఆనందంగా ఉందని, స్వామివారి చల్లని చూపు ఈ ప్రాంత ప్రజలపై ఉండాలని సుభిక్షంగా ఆనందంగా ఉండేలా స్వామివారిని చూడాలని కోరుకున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పిటిసి పైల సన్యాసి రాజు , పరవాడ మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, గొర్లివాన్ని పాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, వైసిపి నాయకులు దళై నదియా, గంజి సురేష్, సాలపు సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## 16న ఆర్డిఓ కార్యాలయం ముట్టడి

■ బీసీ సంక్షేమ సంఘం రాష్ట కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపు

జయభేరి, దేవరకొండ :

పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్ లు , ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు ఈనెల 16న రాష్ట్ర వ్యాప్తం గా కలెక్టరేట్ ,ఆర్డిఓ కార్యాలయం ముట్టడిని చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానికం గా ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో కలెక్టరేట్ , ఆర్డిఓ కార్యాలయం ముట్ట డిని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నటువంటి విద్యార్థుల యొక్క స్కాలర్ షిప్ లు , ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి. చేయని యెడల భారీ ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, రాజకీయ పార్టీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ,విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులందరూ అందరు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

## కలెక్టర్ పై దాడి.. స్పందించిన సీఎం రేవంత్



జయభేరి, హైదరాబాద్:

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ దాడి ఘటనపై సీఎం రేవంత్ స్పందించారు. ఈ రకమైన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నా. దాడుల వెనుక ఎంతవారు ఉన్నా ఊచలు లెక్కపెట్టాల్సిందే. దాడులు చేయించిన వారిని చేసిన వారిని ఎవరిని వదలము. ఇలాంటి దాడులు బిఆర్ఎస్, హయంలో జరిగితే కేటీఆర్ సమర్థిస్తారా? అధికారులపై దాడులను ఎందుకు ఖండించదు. అలాగే దాడి చేసిన వారిని ఎలా పరామర్శిస్తారు. అంటే దాడులను ప్రోత్సహించేందుకే పరమర్శలా అని ప్రశ్నించారు.




# ఈ ఏడాది కలిసొచ్చింది

“మట్కా’ చిత్రంలో సుజాత అనే అమాయకమైన అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. మూడు భిన్నమైన కాల వ్యవధుల్లో నా క్యారెక్టర్ సాగుతుంది. ఒక జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ ఎమోషనల్‌గా ఉంటుంది’ అని చెప్పింది మీనాక్షి చౌదరి. ఇటీవల విడుదలైన ‘లక్కీ భాస్కర్’ చిత్రంతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న ఈ భామ తాజాగా ‘మట్కా’ చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. వరుణ్‌తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ‘ఈ ఏడాది బాగా కలిసొచ్చింది. ‘లక్కీ భాస్కర్’ విజయం సాధించింది. ఇప్పుడు ‘మట్కా’ విడుదలకానుంది. ఇదే నెలలో ‘మెకానిక్ రాకీ’ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఇలా ఒకే నెలలో మూడు చిత్రాలు రావడం స్పెషల్ మూమెంట్‌గా భావిస్తున్నా’ అని చెప్పింది. ‘మట్కా’ సినిమాలో తాను పోషించిన సుజాత పాత్ర గురించి మాట్లాడుతూ ‘తను ఎప్పుడు ఆశావహదృక్పథంతో కనిపిస్తుంది. హీరో వాసు జీవితంలో ఓ వెలుగులా ఉంటుంది. ప్రతీ అమ్మాయి నా పాత్రతో కనెక్ట్ అవుతుంది. ముఖ్యంగా భిన్న కాలాల్లో నా పాత్ర పరివర్తన చెందే తీరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. యుక్త వయస్సు పాత్రలో వింటేజ్ లుక్‌లో కనిపిస్తాను. ఆ తర్వాత జీవితంలోని దశలు మారేకొద్దీ నా లుక్స్ మారుతుంటాయి. ఇది పీరియాడిక్ డ్రామా కాబట్టి ఈ సినిమా విషయంలో చాలా హోమ్‌వర్క్ చేశాను’ అని చెప్పింది. నటిగా అన్ని జోనర్స్ ఇష్టమేనని, ప్రేక్షకులకు గుర్తుండిపోయే బలమైన పాత్రలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నానని మీనాక్షి చౌదరి పేర్కొంది.



# బ్రేకప్ వల్ల డిప్రెషన్‌లోకి వెళ్లా!

కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ వెలుగువెలిగింది పంజాబీ భామ రాశీఖన్నా. ‘థాంక్యూ’ సినిమా తర్వాత టాలీవుడ్‌లో కాస్త బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం ‘తెలుసు కదా’ అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో ఆమె నటించిన ‘ది సబర్మతీ రిపోర్ట్’ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. గుజరాత్ గోద్రా రైలు దహనం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రాశీఖన్నా. గతంలో తాను ప్రేమలో ఉన్నానని, అనుకోని కారణాల వల్ల బ్రేకప్ అయిందని తన విఫల ప్రేమను తలచుకొని భావోద్వేగానికి గురైంది. రాశీ ఖన్నా మాట్లాడుతూ ‘నేను చాలా సున్నిత మనస్కురాలిని. కొన్నేళ్ల క్రిందట ఓ వ్యక్తిని గాఢంగా ప్రేమించాను. కానీ దురదృష్టవశాత్తు మేమిద్దరం విడిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. కొన్ని నెలల పాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. ఆ తర్వాత ధైర్యాన్ని కూడగట్టుకొని కెరీర్ మీద దృష్టి పెట్టాను. నా శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల మద్దతు వల్ల ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడ్డా’ అని చెప్పింది. అయితే తనతో ప్రేమాయణం నడిపిన వ్యక్తి గురించి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు రాశీఖన్నా. దాంతో సదరు వ్యక్తి ఎవరోనని అభిమానులు ఆరా తీస్తున్నారు. రంజన్ చందేల్ దర్శకత్వం వహించిన ‘ది సబర్మతీ రిపోర్ట్’ ఈ నెల 15న విడుదలకానుంది.





# పాన్ ఇండియాకు రీచ్ అయ్యేలా..

సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్‌కు ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంటుంది. అలాంటి వాటిలో త్రివిక్రమ్, అల్లు అర్జున్ కాంబో ఒకటి. వీరిద్దరి కలయికలో వచ్చిన జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో చిత్రాలు ప్రేక్షకుల్ని ఎంతగానో అలరించాయి. తాజాగా ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతున్న విషయం తెలిసిందే. ‘పుష్ప 2’ రిలీజ్ తర్వాత అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్‌లో జాయిన్ కాబోతున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై యస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ ఒకటి ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. పీరియాడిక్ కథాంశంతో దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, తన గత చిత్రాలకు భిన్నంగా పాన్ ఇండియాకు రీచ్ అయ్యేలా ఈ కథను తీర్చిదిద్దుతున్నారని తెలిసింది. బన్నీకి ఉన్న గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సబ్జెక్ట్ విషయంలో త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెబుతున్నారు. జూన్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. త్రివిక్రమ్, అల్లు అర్జున్ కాంబినేషనలో రాబోతున్న ఈ నాలుగో చిత్రంపై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి.



# తెర వెనక ముచ్చట్లు

హీరో రానా ‘ది రానా దగ్గుబాటి షో’ పేరుతో ఓ సెలబ్రిటీ టాక్‌షోకు హోస్ట్‌గా వ్యవహరించబోతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా స్వీయ నిర్మాణంలో రూపొందిస్తున్న ఈ ఒరిజినల్ సిరీస్ ఈ నెల 23 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. మొత్తం ఎనిమిది ఎపిసోడ్స్‌లో రాబోతున్న ఈ సిరీస్‌లో సెలబ్రిటీలు వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకోవడంతో పాటు వివిధ యాక్టివిటీస్‌లో పాల్గొంటారు. రాజమౌళి, రామ్‌గోపాల్‌వర్మ, దుల్కర్ సల్మాన్, నాగచైతన్య, సిద్ధూ జొన్నలగడ్డ, శ్రీలీల, నాని వంటి ప్రముఖులు ఈ టాక్‌షోలో పాల్గొనబోతున్నారు. ఫిల్టర్ చేయని సంభాషణలు, సెలబ్రిటీల తెర వెనక ముచ్చట్లు, ఇప్పటివరకు వారి ఫ్యాన్స్‌కు తెలియని విశేషాలతో ఈ టాక్‌షో వీక్షకులకు ఆకట్టుకుంటుందని ప్రైమ్ ఇండియా ఒరిజినల్స్ హెడ్ నిఖిల్ మధోక్ తెలిపారు. సినీ తారల నిజ జీవితాలను తెలుసుకోవడానికి ఇదొక అద్భుతమైన వేదిక అని టాక్‌షో హోస్ట్, క్రియేటర్ రానా పేర్కొన్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com